RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శనివారం 03-10- 2026 సంపుటి : 6 సంచిక : 233 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు
- కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా



తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో

## ముంబైలో పోటాపోటీ నిరసనలు..

2లో

- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్' ఆందోళన
- సీఈసీ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆందోళన
- పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు



## ప్రజా పాలనకు గాంధీజీ ఆశయాలే కీలకం

సత్యం, అహింస మార్గంలో శాంతి, న్యాయం ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి కీలక వ్యాఖ్యలు బాపూఘాట్‌లో గవర్నర్?, సీఎం నివాళులు



హైదారాబాద్, **అభ్యుదయం**

గాంధీ మహాత్ముడి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద ఆయన సమాధికి గవర్నర్? శివప్రతాప్? శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి నివాళులు అర్పించారు. గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. వారితో పాటు పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా బాపూజీకి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం అహింసనే ఆయుధంగా మలచి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ మానవాళికి సత్యం, శాంతి, మానవత్వం నేర్పిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన గాంధీజీ చిత్ర ప్రదర్శనను గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి తిలకించారు. అనంతరం డిజిటల్ మ్యూజియాన్ని గవర్నర్‌తో

- మిగతా 2లో

## రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు
- తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30
- పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి
- లగేజీపై కూడా అదనపు చార్జీలకు అనుమతి
- అధికారికంగా జీవో జారీ చేసిన ప్రభుత్వం




హైదారాబాద్, **అభ్యుదయం**

ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వ ఊరట కల్పించింది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు శుక్రవారం రేవంత్ సర్కార్ అధికారికంగా ఒక జీవో కూడా జారీ చేసింది. ఆటోల కనీస చార్జీని రూ.20 నుంచి రూ.30కి పెంచుతున్నట్లు జీవోలో పొందుపర్చింది. ప్రతీ కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14కి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇక టిటెన్షన్ చార్జి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచగా.. లగేజీ ఛార్జీ 25 పైసల నుంచి 50 పైసలకు పెంచారు. ఇక గరిష్ట లగేజీ

- మిగతా 2లో పేజీలో

## గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి



- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే మా పాలన
- వివక్ష లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- గాంధీ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు

హైదారాబాద్,**అభ్యుదయం** గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళు లర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో

మిగతా 2లో

## దేశంలో ఏపీని నెం.1గా నిలపడమే మా లక్ష్యం

- ఇందుకు మీ అందరి సహకారం కావాలి
- దశాబ్ద కాలంలోనే భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలం
- ఈ మార్పునకు ఏపీ నాయకత్వం వహించాలని కోరుకుంటోంది
- దేశం గర్వపడేలా రాజధాని అమరావతిని తీర్చిదిద్దుతాం
- విజయవాడలో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ టీమ్ డిన్నర్ మీటింగ్ లో మంత్రి లోకేష

మిగతా 2లో



అమరావతి,**అభ్యుదయం** దేశంలో ఏపీని నెం.1గా నిలపడమే మా లక్ష్యమని, ఇందుకు మీ అందరి సహకారం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హోటల్ లో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ టీమ్ తో జరిగిన డిన్నర్ మీటింగ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు గురించి మీ అందరికీ తెలుసు. ఆపరేటింగ్

## కొడంగల్‌లో సభ పెడతాం



- రేవంత్ కు చెమటలు పట్టిస్తాం
- ఖైరతాబాద్ లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు

2లో

## బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు

- 34 శాతం రిజర్వేషన్ల జీవో కేవలం రాజకీయ గిమ్మిక్కే
- సుప్రీంకోర్టుకు వెళ్తామనడం బీసీలను మోసగించడమే
- వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స

2లో



## ముంబైలో పోటాపోటీ నిరసనలు..

ముంబై, అక్టోబర్ 02: ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు. వీరికి ప్రతిగా జెన్ నెక్ట్స్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు. ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్ట్స్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్ట్స్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.

## బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు

అమరావతి, అక్టోబర్ 02 ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు మరోసారి వెన్నుపోటు పొడిచారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ జీవో న్యాయపరంగా నిలవదని తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. "రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు బీసీలను మోసం చేసేందుకు ఈ జీవో ఇచ్చారు. ఇప్పుడు హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పడం బీసీలను మరోసారి మభ్యపెట్టడమే" అని బొత్స అన్నారు. ప్రభుత్వానికి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను వైసీపీ అడ్డుకుంటోందని టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని బొత్స మండిపడ్డారు. వెన్నుపోటు పార్టీలో ఉన్న బీసీ నాయకులు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపవద్దని హితవు పలికారు. బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

పరిమితి 100 కిలోలుగా కొనసాగించారు ఇక రాత్రి సమయాల్లో ఛార్జీలపై 1.5 రెట్లు కొనసాగించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆటో ఛార్జీలను ప్రభుత్వం సవరించింది.కొత్త ఆటో ఛార్జీల అమలు కోసం మీటర్ల రీసెట్టింగ్‌కు ప్రభుత్వం 3 నెలల గడువు విధించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. మూడు నెలల్లోగా ఆటో డ్రైవర్లు డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆటో ఛార్జీలను అధికారికంగా ధృవీకరిస్తూ జీవో 46 జారీ చేసింది. ఈ చార్జీలు తక్షణమే అమల్లో వస్తాయని వెల్లడించింది. ఇక ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల ఆటో ఆగినప్పుడు నిమిషానికి 75 పైసలు చొప్పున వెయిటింగ్ ఛార్జీ ఖరారు చేశారు. రాత్రి సమయాల్లో ప్రయాణించేవారు సాధారణ ఛార్జీల కంటే అదనంగా 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది.

## గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## యువ వైద్యురాలు అనుమానాస్పద మృతి

హైదారాబాద్, అక్టోబర్ 02హైదరాబాద్‌లో ఓ యువ వైద్యురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట్ ఆదిత్య నగర్‌లోని ఓ ప్రైవేట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతురాలు (27) సంగారెడ్డి జిల్లాకు చెందిన యువతి. మహబూబ్‌నగర్‌లో వైద్య విద్యను అభ్యసించిన ఆమె, ఇటీవల వరంగల్‌లో పీడియాట్రిక్స్‌లో పీజీ పూర్తి చేశారు.

## దేశంలో ఏపీని నెం.1గా నిలపడమే మా లక్ష్యం

సిస్టమ్‌లు ఒక్కో వెర్షన్‌తో మరింత మెరుగుపడుతుంటాయి. అదే విధంగా మన ముఖ్యమంత్రి కూడా ప్రతి వెర్షన్‌తో మరింత మెరుగవుతున్నారు. ఇది ఆయన నాలుగో వెర్షన్. ప్రజాప్రభుత్వంలో 50 శాతం మంది శాసనసభ్యులు తొలిసారి ఎన్నికైనవారే. అలాగే 25 మంది మంత్రుల్లో 17 మంది తొలిసారి మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. నేను ఇప్పుడు సీనియర్ మంత్రిని. రాష్ట్రాభివృద్ధి కోసం మేమంతా కసితో, పట్టుదలతో పనిచేస్తున్నాం.

**ఏపీలో అందరం కలిసి నూతన చరిత్రను సృష్టిస్తున్నాం:**

ఈ రోజు సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, అనంత్ అంబానీతో కలిసి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ మిషన్ లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగం కలిసి దాదాపు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రపంచంలోనే ఉద్యానవన రంగంలో భారత్‌ను నెం.1 స్థానానికి తీసుకెళ్లడమే ఈ మిషన్ లక్ష్యం. ఏపీలో హార్టికల్చర్ నుంచి స్పేస్ వరకు, డ్రోన్ల నుంచి క్వాంటమ్ టెక్నాలజీ వరకు, డేటా సెంటర్ల వరకు ఎన్నో రంగాల్లో ముందుకు సాగుతున్నాం. ఏపీలో మనం నూతన చరిత్రను సృష్టిస్తున్నాం. అంతా కలిసి మన లక్ష్యాలను కార్యరూపంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

**దశాబ్ద కాలంలోనే భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలం:**

ఏపీ మీకు ఒక అద్భుతమైన వేదికను అందిస్తోంది. ఇక్కడ కొత్త ఆలోచనలు, కొత్త విధానాలతో వాటికి ఒక బెంచ్‌మార్క్‌ను సృష్టించాలనుకుంటున్నాం. పోటీతో కూడిన సమాఖ్య వ్యవస్థలో ఒక రాష్ట్రం ఒక మంచి పని చేస్తే, మిగతా రాష్ట్రాలు కూడా దానిని అనుసరిస్తాయి. అందువల్ల ఏపీ మార్గదర్శకంగా నిలవగలదని విశ్వసిస్తున్నా. యూరప్, అమెరికా అభివృద్ధి చెందిన దేశాలుగా మారడానికి 100 నుంచి 120 సంవత్సరాలు పట్టింది. దుబాయ్‌కు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు పట్టింది. సింగపూర్ కేవలం 25 సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగింది. ఇక్కడ ఉన్న మేధోశక్తి, ప్రతిభ, సంకల్పం, సానుకూల నాయకత్వాన్ని గమనిస్తే.. భారత్‌ను కేవలం 10 సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలమని నేను నమ్ముతున్నా. ఒక దశాబ్దంలోనే మనం అభివృద్ధి చెందిన దేశంగా మారగలం. ఒక రాష్ట్రంగా ఏపీ ఈ మార్పునకు నాయకత్వం వహించాలని భావిస్తోంది.

**దేశం గర్వపడేలా రాజధాని అమరావతిని తీర్చిదిద్దుతాం:**

దేశంలో 'నమో' అంటే ప్రధాని నరేంద్ర మోదీ. ఏపీలో 'నమో' అంటే 'నాయుడు జీ, మోదీ జీ కా జోడీ. ఇతర రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే ఏపీలో మాత్రం డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. మనం పనిచేసే వేగం అలాంటిది. దేశంలో ఏపీ నెం.1గా నిలవాలనేది మా లక్ష్యం. ఇందుకు మీ అందరి సహకారం కావాలి. మీ సూచనలు, ఆలోచనలు వినడానికి మేం ఎంతో ఆసక్తిగా ఉన్నాం. మేం నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఇక్కడికి వచ్చిన మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీరు ప్రస్తుతం విజయవాడలో ఉన్నారు. నది అవతలే అమరావతి ఉంది. మీకు సమయం ఉంటే తప్పకుండా అక్కడికి వచ్చి చూడాలి. మనం షాంఘై, బీజింగ్, సింగపూర్ వంటి నగరాల గురించి మాట్లాడతాం. మన ముఖ్యమంత్రి నాయకత్వంలో దేశం, ప్రపంచం మొత్తం అమరావతి గురించి మాట్లాడే రోజు వస్తుంది. ప్రపంచస్థాయి రాజధాని నగరాన్ని నిర్మించాలనేది మా లక్ష్యం. దేశం గర్వపడేలా అమరావతిని తీర్చిదిద్దుతాం. ఒక్కసారి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తే ముఖ్యమంత్రి విజన్ ఏంటో స్పష్టంగా అర్థమవుతుందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

## కొడంగల్‌లో సభ పెడతాం

హైదారాబాద్, అక్టోబర్ 02

తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

## ప్రజా పాలనకు గాంధీజీ ఆశయాలే కీలకం

కలిసి ప్రారంభించారు. ఆ తర్వాత సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్? గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. సత్యం, అహింస, స్వావలంభన, గ్రామ స్వరాజ్యం, సామాజిక సమానత్వం గాంధీ ఆశయాలకు పునాదులని రేవంత్? రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజా పాలనకు ఆయన ఆశయాలే కీలకమని వివరించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో శాంతి, సామాజిక న్యాయం, సమానత్వం, అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరించడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని సీఎం ట్వీట్? చేశారు. గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ సంస్థ నేతృత్వంలో ఎల్బీ స్టేడియంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 1157 చరకాలను గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ సంస్థ ప్రదర్శించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్ వెంకటస్వామి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ హాజరయ్యారు. ?గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్?ను ప్రత్యేకంగా పరిశీలించారు.

## ఇకపై అన్ని సబ్జెక్టులకు ప్రాక్టికల్స్!?

హైదారాబాద్, అక్టోబర్ 02 తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం (2026-27) నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు బోర్డు కీలక మార్పులు తీసుకొచ్చింది. చదువుకునే సిలబస్‌తో పాటు పరీక్షల విధానంలోనూ సమూల మార్పులు చేశారు. ఇప్పటివరకు కేవలం కొన్ని సబ్జెక్టులకే పరిమితమైన ప్రాక్టికల్స్‌ను.. ఇప్పుడు అన్ని సబ్జెక్టులకు (ఇంటర్నల్ అసెస్‌మెంట్ రూపంలో) ప్రవేశపెట్టారు. ఈ కొత్త విధానంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. కొత్త విధానం ప్రకారం మొత్తం మార్కుల్లో రాత పరీక్షకు 80 శాతం, ప్రాక్టికల్స్‌కు 20 శాతం మార్కులను కేటాయించారు. ఒకవేళ ఎగ్జామ్ 80 మార్కులకు ఉంటే, విద్యార్థులు పాస్ కావాలంటే కనీసం 28 మార్కులు (35 శాతం) సాధించాల్సి ఉంటుంది. అలాగే ప్రాక్టికల్స్‌కు కేటాయించిన 20 మార్కులలో కనీసం 7 మార్కులు వస్తేనే పాసైనట్లు లెక్క. సైన్స్ సబ్జెక్టుల విషయానికి వస్తే.. గతంలో కేవలం సెకండియర్‌లోనే ప్రాక్టికల్స్ ఉండేవి. కానీ, ఇకపై ఫస్టియర్‌లో సగం, సెకండియర్‌లో మరో సగం చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ సబ్జెక్ట్ విషయంలోనూ బోర్డు స్పష్టతనిచ్చింది. ఫస్టియర్ విద్యార్థులకు ఒకే ఒక పాఠ్య పుస్తకం ఉంటుంది.

## నదుల్లో వ్యర్థాలు వదలొద్దు...

తదితరులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కృష్ణా, గోదావరినదుల్లోకి వ్యర్థాలు, మురుగునీటిని వదిలేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగువ ప్రాంతాల్లో ప్రజలు నదుల నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారని తెలిపారు. నదులను కలుషితమైతే అది ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా అపరిశుభ్రత ద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలు వస్తాయని సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. నదుల కలుషితం వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పర్యావరణానికి నష్టం చేసే చర్యల వల్లే ఎల్‌నినో లాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ఎల్ నినో ప్రభావంతో కృష్ణా నదికి నీరు రాని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరు అందించడంతో పాటు మురుగునీటి శుద్ధికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీపీలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

**స్వచ్ఛత ద్వారా ఆరోగ్యాంధ్ర:**

వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, ఆలోచనల్లోనూ స్వచ్ఛత ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు.. వ్యక్తిగత శుభ్రత పాటిస్తే అనారోగ్యం దరి చేరదన్నారు. గాంధీజీ



స్వాతంత్ర్యం పోరాటంతో పాటు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారని సీఎం పేర్కొన్నారు. కోల్‌కతాలో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను చూసి ఆయనే స్వయంగా శుభ్రం చేశారని గుర్తు చేశారు. పరిశుభ్రత ఏ ఒక్క వర్గానికో సంబంధించిన అంశం కాదని, ఆరోగ్యం కోసం ఎవరి పరిసరాలను వారే శుభ్రంగా ఉంచుకోవాలన్నదే గాంధీజీ సందేశమని చెప్పారు. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసి స్వచ్ఛతా కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. గత పాలకుల కాలంలో పరిశుభ్రతపై తగిన శ్రద్ధ లేకపోవడంతో టన్నుల కొద్దీ చెత్త రోడ్లపై పేరుకుపోయేదని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని, తాను కూడా ప్రతి నెలా స్వయంగా పాల్గొంటున్నానని తెలిపారు. రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు.

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

హైదారాబాద్, అక్టోబర్ 02

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి

అభ్యుదయం
The Pride of Telugu national daily

శనివారం 3-10-2026

# మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్..

**అధికారికంగా ప్రారంభించిన ప్రభుత్వం**

హైదారాబాద్, అక్టోబర్ 02 హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రయాణీకుల రవాణా అవసరాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ప్రయాణించే పౌరుల కోసం హైదరాబాద్ మెట్రో, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) సంయుక్తంగా రూపొందించిన ఒకే ఉమ్మడి పాస్‌ను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారుల సమక్షంలో ఈ నూతన కామన్ పాస్‌ను ఆవిష్కరించారు. ఈ కామన్ పాస్ ఆవిష్కరణ వెనుక ప్రధాన లక్ష్యం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిరాటంకమైన, సులభతరమైన, సమగ్ర ప్రజారవాణా అనుసంధానాన్ని కల్పించడమే. నిత్యం లక్షలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నగరంలో ప్రయాణాల కోసం బస్సులు, మెట్రో రైళ్లపై ఆధారపడుతుంటారు. ఇప్పటివరకు వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సి రావడం వల్ల సమయం వృథా అవ్వడంతో పాటు ఇబ్బందులు ఎదురవుతుండేవి. ఈ కొత్త విధానం ద్వారా ప్రయాణీకులు ఒక్క కార్డుతోనే రెండు రవాణా వ్యవస్థల సేవలను వినియోగించుకోవచ్చు. ప్రయాణీకుల సౌకర్యం కోసం ప్రభుత్వం ఈ కామన్ పాస్‌లలో రోజువారీ, నెలవారీ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజువారీ ఉమ్మడి పాస్ ధరను రూ.400గా నిర్ణయించారు. ఇందులో మెట్రో ప్రయాణ ఛార్జీ కింద రూ.300 , ఆర్టీసీ ప్రయాణ ఛార్జీ కింద రూ.100 వేర్వేరుగా లెక్కించబడతాయి. అలాగే రోజూ ప్రయాణించే వారి కోసం నెలవారీ ఉమ్మడి పాస్‌ను రూ.8,500లకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నెలవారీ పాస్‌లో మెట్రో వాటా రూ.7,000 కాగా.. ఆర్టీసీ వాటా రూ.1,500గా లెక్కించబడతాయి. ఈ స్మార్ట్ కార్డ్ డిపాజిట్, వినియోగ నిబంధనలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రయాణీకులు మొదటిసారి ఈ కార్డును కొనుగోలు చేసేటప్పుడు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ భవిష్యత్తులో ఈ కార్డు అవసరం లేదనుకుని ఆర్టీసీ లేదా మెట్రో యాజమాన్యానికి తిరిగి ఇచ్చేస్తే ఆ రూ.100 డిపాజిట్ సొమ్మును ప్రయాణీకుడికి తిరిగి వాపసు చేస్తారు. ఈ




కామన్ పాస్ వినియోగం లిమిట్స్ విషయానికి వస్తేయ.. ఔటర్ రింగ్ రోడ్(ూ==) పరిధి లోపల నడిచే అన్ని రకాల ఆర్టీసీ సిటీ బస్సులతో పాటు మెట్రో రైళ్లన్నింటిలోనూ ప్రయాణించడానికి ఇది వర్తిస్తుంది. సిటీ సాధారణ, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే ప్రత్యేక ఏసీ బస్సులు అయిన 'పుష్పక్' సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. ఈ నూతన ఉమ్మడి పాస్ విధానం వల్ల నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రజారవాణా వినియోగం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

# ట్రైన్‌లోకి పాములతో ఎంట్రీ..!?

బిహార్, అక్టోబర్ 02 సాధారణంగా వికలాంగులూ, లేదా యాచకులు ట్రైన్‌లో ప్యాసింజర్స్ నుంచి డబ్బులు అడగడం మనం చూసి ఉంటాం. కానీ ఇక్కడ కొందరు వ్యక్తులు మాత్రం.. పాములతో ప్రయాణికులను బెదిరించి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ షాకింగ్ ఘటన బిహార్‌లో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. సోన్‌పూర్ డివిజన్ పరిధిలో నడిచే జనసేవా ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లోకి ఎక్కిన ఆరుగురు వ్యక్తులు.. చేతులో పాములను పట్టుకొని.. ప్రయాణికులను బెదిరించి డబ్బులు వసూలు చేయడం స్టార్ట్ చేశారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన ప్రయాణికులు వెంటనే రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు.దీంతో వెంటనే అప్రమత్తమైన సోన్‌పూర్ ఆవుట్‌పోస్ట్ ఖాకీ సిబ్బంది నెక్స్ట్ స్టేషన్‌లో రంగంలోకి దిగి.. పాములతో ప్రయాణికులను భయపెడుతున్న మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా.. వారంతా పొంతనలేని సమాధానాలు చెప్పినట్టు పోలీసలు తెలిపారు.. వారి ఆచూకీ గురించి ప్రశ్నించగా కొందరు లక్నో అని, మరికొందరు హిమాచల్ ప్రదేశ్ అంటూ పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని ఈసీఆర్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సరస్వతి చంద్ర తెలిపారు.ప్రస్తుతం వారి గురించి పూర్తి వివరాలు రాబట్టే పనిలో ఉన్నామని.. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు. అలాగే ట్రైన్లలో పాములను తీసుకురావడం చట్టరిత్యా నేరమని.. ఇలాంటి ఘటనలకు ఎవరైనా పాల్పడితే.. చట్టప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అలాగే.. పాములను హింసించడం వంటివి కూడా చట్టరిత్యా నేరమని.. వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రేవంత్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి

- ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి
- నా ఆస్తిపైనా విచారణకు ఎప్పుడైనా సిద్ధమే
- ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు



హైదారాబాద్, అక్టోబర్ 02): తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల విచారణ సవాళ్లు మరింత ముదురుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని నేతలు దొంగలేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ తమ ఆస్తులపై విచారణ కోరుతూ సోమవారం లోగా హైకోర్టుకు లేఖ రాయాలని రఘునందన్ సవాల్ విసిరారు.

ఒకవేళ వారు స్పందించకపోతే, తానే స్వయంగా హైకోర్టుకు లేఖ రాస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ముగ్గురం కలిసి సిట్టింగ్ జడ్జికి విచారణ కోసం విజ్ఞప్తి చేద్దామని, తన ఆస్తులపైనా విచారణకు తాను సిద్ధమేనని ప్రకటించారు. ఇటీవల సిరిసిల్ల సభలో కేటీఆర్ ఆస్తుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేయగా, దానికి ప్రతిగా తమ ఇద్దరి కుటుంబాల ఆస్తులపైనా న్యాయ విచారణ జరిపించాలని కేటీఆర్ సవాల్ చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ కూడా ఈ అంశాన్ని తెరపైకి తేవడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# మొబైల్ దొంగిలించాడనే అనుమానంతో వ్యక్తి హత్య

హైదారాబాద్, అక్టోబర్ 02

మొబైల్ ఫోన్ దొంగిలించాడనే చిన్న అనుమానం ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. ఎలాంటి నిర్ధారణ లేకుండానే ఓ వ్యక్తిపై మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేసిన దారుణ ఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఈ కేసులో ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27న వినాయక చవితి సందర్భంగా అన్నదానం కార్యక్రమం జరుగుతున్న సమయంలో గుండెని ప్రవీణ్‌కు చెందిన మొబైల్ ఫోన్ కనిపించకుండా పోయింది. దీంతో అతడు ఫోన్ కోసం వెతకడం ప్రారంభించాడు. ఈ క్రమంలో 29న 'ఫైండ్ మై డివైస్' యాప్ ద్వారా ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేశాడు. యాప్ చూపించిన లొకేషన్ ఆధారంగా వెతకగా.. బ్యాగరి రామానుజానికి చెందిన పొలంలోని రాళ్ల మధ్య ఓ ప్లాస్టిక్ కవరులో మొబైల్ ఫోన్ లభించింది. దీంతో రామానుజమే ఫోన్‌ను దొంగిలించాడనే అనుమానం ప్రవీణ్‌తో పాటు అతని అనుచరుల్లో బలపడింది.ఈ అనుమానంతో కక్ష పెంచుకున్న గుండెని ప్రవీణ్, గుండెని రమేష్, ఎంకమొల్ల రమేష్, గుండెని బాబురావు, నాగని రామానుజం, ఎంకమొల్ల ప్రశాంత్, మాసాని శ్రీను, గుండెని సత్యనారాయణ.. అర్ధరాత్రి సమయంలో బ్యాగరి రామానుజంపై దాడికి పాల్పడ్డారు. చేతులు, కాళ్లతో తన్నడంతో పాటు కర్రలతో రామానుజాన్ని విచక్షణారహితంగా కొట్టినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న రామానుజం భార్య, కుమార్తె అక్కడికి చేరుకుని దాడి చేయొద్దంటూ నిందితులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు వెనక్కి తగ్గకుండా దాడి కొనసాగించినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన రామానుజం అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిలో ఎలాంటి కదలికలు లేకపోవడాన్ని గమనించిన నిందితులు భయంతో అక్కడి నుంచి పరారయ్యారు.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తూప్రాన్ సీఐ వెంకటరాజాగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో అరెస్టైన వారిలో ఓ మైనర్ బాలుడు కూడా ఉన్నట్లు తూప్రాన్ సీఐ వెల్లడించారు. మొబైల్ ఫోన్ దొంగతనం చేశాడనే అనుమానంతో ఎలాంటి నిర్ధారణ లేకుండానే దాడికి పాల్పడటం, చివరకు ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## సంతోషిమాత ఆలయంలో విగ్రహంపై దాడి

**పూజలు చేస్తుండగా విగ్రహాన్ని కొట్టిన ఆగంతుకుడు**

**ఘటనను ఖండించిన బీజేపీ నేతలు, ఆందోళన**

హైదారాబాద్, అక్టోబర్ 02: హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భవానీ నగర్ కాలనీలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం పూజలు జరుగుతుండగా ఒక వ్యక్తి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో భక్తులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. నేరుగా గర్భగుడిలోకి వెళ్లి తన చేతిలోని కర్రలతో విగ్రహంపై దాడి చేయడం ప్రారంభించాడు. ఈ హఠాత్పరిణామంతో భయాందోళనకు గురైన భక్తులు కేకలు వేశారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎల్బీ నగర్ ఏసీపీ రవీంద్ర రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నిందితుడిని మహమ్మద్ అన్సారీగా పోలీసులు గుర్తించారు. అతను కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. నిందితుడు గర్భగుడిలోకి వెళ్లి విగ్రహంపై దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ రంగారెడ్డి అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వాణిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఆలయాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# ఇద్దరు పాక్ చొరబాటుదారుల కాల్చివేత

**కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు**

**చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్**



న్యూఢిల్లీ, అక్టోబర్ 02: పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి. అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది.

ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

# బల్లార్షా-గూడూరు మధ్య నాలుగో రైల్వే లైన్

**గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర రైల్వే శాఖ**



హైదారాబాద్, అక్టోబర్ 02

బల్లార్షా-కాజీపేట-విజయవాడ-గూడూరు మధ్య నాలుగో రైల్వే లైన్ నిర్మాణ పనులు వేగం పుంజుకోనున్నాయి. ఈ ముఖ్యమైన ప్రాజెక్టుకు కేంద్ర రైల్వే శాఖ గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 744.80 కిలోమీటర్ల పొడవైన ఈ లైన్‌తో పాటు ఇందుపల్లి-దుగ్గిరాల మధ్య 36.80 కిలోమీటర్ల డబుల్ లైన్ పనులకు కూడా అధికారిక ఆమోదం లభించింది. ఈ నోటిఫికేషన్‌తో భూసేకరణ ప్రక్రియకు కీలక అడుగు పడింది. ఈ ప్రాజెక్టు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో చేపట్టబడుతోంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా నుంచి తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వరకు ఈ మార్గం విస్తరించి ఉంది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే చెన్నై-న్యూఢిల్లీ రూట్‌లో భాగమైన ఈ లైన్ ప్రయాణికులు, సరుకు రవాణా రైళ్లకు పెద్ద ఉపశమనం కలిగిస్తుంది. ఇప్పటికే కాజీపేట-బల్లార్షా, కాజీపేట-విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. నాలుగో లైన్ పూర్తయితే రైళ్ల రద్దీ గణనీయంగా తగ్గుతుంది. రైళ్ళ రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ బలోపేతం అవుతుంది. బొగ్గు, సిమెంట్, ఇనుప ధాతువు వంటి సరుకుల రవాణా కూడా సులభతరం కానుంది. ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. స్థానిక రైతులు, ప్రజలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. పరిహారం, పునరావాసం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించనున్నారు.

ఈ నాలుగో లైన్ పూర్తయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుంది. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వ్యాపార, పారిశ్రామిక రంగాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది

. కేంద్ర రైల్వే శాఖ ఈ ప్రాజెక్టును ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా గుర్తించి, వేగంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గెజిట్ నోటిఫికేషన్ జారీ కావడంతో పనులు మరింత ఉత్సాహంగా సాగనున్నాయి.

రద్దీగా ఉండే చెన్నై-న్యూఢిల్లీ రూట్‌లో ఇది ఒక కీలక లైన్ గా మారనుంది.

# బిక్కవోలు పీహెచ్‌సీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

**పరిశుభ్రత,పారిశుద్ధ్య నిర్వహణకు గుర్తింపు.**



బిక్కవోలు,అక్టోబర్02 తూర్పుగోదావరి జిల్లా (ప్రతినిధి, కర్రి దుర్గారెడ్డి) తూర్పు గోదావరిజిల్లా అనపర్తి నియోజకవర్గంలో బిక్కవోలు ప్రాథమికఆరోగ్యకేంద్రం(పీహెచ్‌సీ)కి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. గాంధీజయంతినిపురస్కరించుకుని శుక్రవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించినఅవార్డులప్రధానోత్సవ కార్యక్రమంలో బిక్కవోలు పీహెచ్‌సీ తరఫున వైద్యురాలు డాక్టర్ దుర్గాదేవి అవార్డునుస్వీకరించారు.పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా డాక్టర్ దుర్గాదేవి స్వచ్ఛ ఆంధ్ర అవార్డును అందుకు న్నారు. పీహెచ్‌సీ పరిసరాల్లో పరిశుభ్రతను పాటించడం, పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల సమర్థ నిర్వహణతో పాటు రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో చేపట్టిన చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కినట్లు తెలిపారు.బిక్కవోలు పీహెచ్‌సీలో ప్రజలకు అందుబాటులో ఉన్న వైద్య సేవలనుమరింతమెరుగుపరచడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వైద్యులు, సిబ్బంది సమష్టిగా కృషి చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి బిక్కవోలు పీహెచ్‌సీకి చెందిన వైద్యులు, వైద్య సిబ్బంది హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ పీహెచ్‌సీకి అవార్డు లభించడం పట్ల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తు లోనూ పరిశుభ్రత, పారిశుద్ధ్యప్రమాణాలను కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామనితెలి పారు.ప్రజాప్రతినిధుల అభినందనలుబిక్కవోలు పీహెచ్‌సీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడంపై అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్య నారాయణ రెడ్డి డాక్టర్ దుర్గాదేవికి, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూఅవార్డుసాధించడంఅభినందనీయమని పేర్కొన్నారు.అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ఈ అవార్డు ఒక్కరి కృషి ఫలితం కాదని, వైద్యులు, నర్సులు, సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది సమష్టి కృషికి లభించిన గుర్తింపుగా వారు పేర్కొన్నారు.బిక్కవోలు పీహెచ్‌సీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించడం మండల ప్రజలకు కూడా గర్వకారణంగా మారింది.ఈ గుర్తింపుతో పీహెచ్‌సీలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణకు మరింత ప్రాధాన్యం లభించడంతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బందిలో మరింత ఉత్సాహం పెరిగింది.

## జగ్గంపేటలో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు



జగ్గంపేట, అక్టోబర్2:సత్యం, అహింస, ధర్మం అనే ఆయుధాలతో దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని, ఆయన చూపిన శాంతి మార్గంలో నేటి యువత పయనిం చాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) పిలుపునిచ్చారు.జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కాకినాడ జిల్లా జగ్గంపేటలోని స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వేడుకలను ఘనంగా నిర్వహించా రు.ఈ కార్యక్రమానికి కొత్త కొండబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాసవి మాత చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన గావించి, అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు,విద్యార్థినీ విద్యార్థులకు చాక్లెట్లు, స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.అనంతరం కొండబాబు మాట్లాడుతూ, గాంధీజీ ఆశయాలను నిత్య జీవితంలో ఆచరించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. నేటి తరం విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, నిజాయితీ వంటి ఉన్నత విలువలను అలవర్చుకోవాలని సూచించారు.ఈ వేడుకల్లో ప్రముఖు లు మానేపల్లి బంగారాజు, కంచర్ల శ్రీను, బొండా నూకబాబు, కొత్త రాము, బి. వీర సత్య, మాతం శెట్టి నారాయణ, వి. నాగసత్య, వి. శ్రీరామ్మూర్తి, మాతం శెట్టి లావణ్య, వి. రాధాకృష్ణారావు, కంచర్ల బాబు, రమాదేవిలతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యా కమిటీ చైర్మన్‌గా పట్నాన నరసింహారాజు ఏకగ్రీవ ఎన్నిక



సంతబొమ్మాలి,అక్టోబర్2:శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం పరిధిలోని చిన్నతుంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (ఎంపీపీ స్కూల్) పేరెంట్స్ కమిటీ (విద్యా కమిటీ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఈ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.

కమిటీ చైర్మన్ గా పట్నాన నరసింహారాజు, వైస్ చైర్మన్‌గా వెంకటరమణ లను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ పట్నాన నరసింహారాజు మాట్లాడుతూ.. పాఠశాల సర్వతో ముఖాభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించేందుకు తన వంతుగా పూర్తిస్థాయి లో కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని బడి ఈడు పిల్లలంద రూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడటంతో పాటు, విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఉపాధ్యా యులకు, తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## జీవీఎంసీ 102 వార్డు పెదమడకలో దుర్గాదేవి నవరాత్రుల రాటపూజ




అగనంపూడి, అక్టోబర్2 జీవీఎంసీ102 వార్డు పెద మడక లో శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రులు సందర్భంగా రాట వేయడం జరిగినది.శ్రీ విజయ దుర్గ భవాని శక్తిపీఠము ఆధ్వర్యంలో శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఎంతో భక్తి శ్రద్ధలతో రాటపూజ ఘనంగా జరిగింది ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొని ఇచ్చట దుర్గా పూజలు గత పది సంవత్సరాల నుండి వీరు ఎంతో ఘనంగా నిర్వహిస్తు న్నారని ఇటీవల జరిగిన వినాయక చవితి ఉత్సవాలకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం విద్యుత్తు ఉచితంగా ఇవ్వడం జరిగిందని అదేవిధంగా దర్గా ఉత్సవాలకు కూడా ఉచిత కరెంటు ఇవ్వాలని పోలీసుశాఖ, విద్యుత్ శాఖ, జీవీఎంసీ వారు నిర్వాహకులకు ఎంతో సహకరించా రని వారికి అభినందనలు తెలియ జేస్తూ దుర్గా ఉత్సవాలకు కూడా సహకరించాలని కోరారు. ఏ డి సి డైరెక్టర్ కొమ్మోజి భీష్మాచారి సభ అధ్యక్షతనధ జరిగిన కార్యక్ర మంలో కొమ్మోజి రమణ, అప్పారావు, ఏ.ఎం.ఏ అకాడమీ కిక్ బాక్సింగ్ హెడ్ కోచ్ కొమ్మోజి అశోక్, సుజాత ,లలిత , చుక్క లక్ష్మీ, ఆనంద్, వంశీ, హరి, గుణ, కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## లీవ్ కార్వింగ్ కళ ద్వారా గాంధీ జయంతి అవగాహన



గొల్లప్రోలు,అక్టోబర్2 కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంగొల్లప్రోలు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూకాలమ్మ గుడి చెశీదుర్తి లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిల్లి గోవిందరాజులు అక్టోబర్ రెండవ తేదీ గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థుల లోనూ,గ్రామ ప్రజలలోను గాంధీ జయంతి గురించి అవగాహన కల్పించడం కోసం రావి ఆకుపై మహాత్మా గాంధీ చిత్రపటాన్ని చెక్కడం జరిగింది దీనిని చూపించి విద్యార్థులకు గాంధీజీ జీవిత చరిత్ర గురించి గాంధీజీ చేసినటువంటి సేవలు గురించి వివరించి చెప్పడం జరిగింది. ఈ విధంగా అవగాహన కల్పించినందుకు గోవిందరాజులను జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు , ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు

## మానవత ఆధ్వర్యంలో గాంధీజీ కి ఘన నివాళులు



పెదపూడి,అక్టోబర్2(సామాజిక ప్రభంజన స్వరం పల్లపాటి శిరీష్ కుమార్): ఈరోజు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ పెదపూడి మండలం/ ఏపీ త్రయం గ్రామం లో అధ్యక్షుడు ముమ్మిడి శివ ఆధ్వర్యంలో 20వ శతాబ్దంలో మన వాలిని అత్యధికంగా ప్రభావితం చేసే నాయకుల్లో ముందు వరుసలో నిలిచిన మహానుభావుడు గాంధీజీ ఈ ప్రపంచానికి సత్యాగ్రహం, ఆహహింస, అనే పదునైన ఆయుధాలను పరిచయం చేసిన మహాత్ముడైన. ఆ శాస్త్రాలను వాడటానికి కూడా ఎంతో ధైర్యం కావాలని నిరూపించారు... ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షుడు ముమ్మిడి శివ భారతీయ జనతా పార్టీ పెదపూడి మండలం, జే, సుధాకర్ డి దుర్గాప్రసాద్, పి అప్పన్న, కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## గాంధీజీ జయంతి సందర్భంగా మానవత ఆధ్వర్యంలో ఘన నివాళులు



తాళ్లపూడి,అక్టోబర్2

జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని తాళ్లపూడి బజార్ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సంస్థ మండల అధ్యక్షుడు తైలం పోశారావు నేతృత్వంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తైలం పోశారావు మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి అనే ఆయుధాలతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సాధించడం లో మహాత్మాగాంధీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని మానవత సంస్థ పేదలు, విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంతో పాటు ప్రతి సంవత్సరం జాతీయ దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.మానవత జిల్లా అధ్యక్షుడు వాసిబోయిన చంద్రయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు జిల్లా కార్యదర్శి బారనాల శంకర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీజీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం, దండి సత్యాగ్రహం వంటి చారిత్రక పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ బాధ్యులు తైలం పోశారావు, వాసిబోయిన చంద్రయ్య, బారనాల శంకర్, సనపల రాజశేఖర్, సాయన సుబ్బారావుతో పాటు సంస్థ సభ్యులు నక్కా ఆనంద్ కుమార్, తైలం పుల్లారావు, మాతిరెడ్డి రత్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## బి.కొత్తకోట ఎంఈఓ కార్యాలయం లో ఘనంగా గాంధీ జయంతి



బి.కొత్తకోట,అక్టోబరు 2

సత్యం, అహింసా మార్గాల్లో నడిచి దేశానికి స్వాతం త్ర్యం తెచ్చిపెట్టిన జాతిపిత మహాత్మా గాంధీ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయుడని బీ.కొత్తకోట మండల విద్యాశాఖ అధికారి--2 (ఎంఈఓ) భీమేశ్వర చారి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజక వర్గం, బీ.కొత్తకోట మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భీమేశ్వర చారి మాట్లాడుతూ... గాంధీజీ చూపిన శాంతి, అహింసా మార్గాలు నేటికీ ప్రపంచానికి మార్గదర్శకాలని తెలిపారు. విద్యార్థులు, యువత గాంధీజీ బోధించిన సత్యం, సమానత్వం, స్వచ్ఛత వంటి విలువలను అలవర్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. దేశ ప్రగతిలో నైతిక విలువల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీలు శ్రీనివాసులు, ఆది, నరసింహులు, ఉబేద్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొడవలి గ్రామంలో ఘనంగా గాంధీ జయంతి.



గొల్లప్రోలు, అక్టోబర్ 2పిఠాపురం నియోజవర్గం గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం గ్రామంలో గ్రామసభను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ గ్రామసభలో స్వర్ణ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు నక్కా బద్రి, కూటమి నాయకులు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు.




# కొన్ని విషయాలు మనతోనే ఉండాలి

వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అద్భుత శతకంతో మెరిసిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ప్రత్యేక సంబరాలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. సెంచరీ పూర్తయ్యాక సాధారణంగా బ్యాట్ పైకెత్తే క్రికెటర్లకు భిన్నంగా.. హిట్‌మ్యాన్ హై-నీ జాగింగ్ తరహాలో వినూత్నంగా అడుగులు వేస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఈ డిఫరెంట్ సెలబ్రేషన్ వెనుక ఉన్న రహస్యమేంటని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, రోహిత్ స్పందిస్తూ.. "కొన్ని విషయాలు మనతోనే ఉండాలి, ప్రతీదీ బయటకు చెప్పాల్సిన అవసరం లేదు" అని వ్యాఖ్యానించడం విశేషం. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ విధించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో రోహిత్ శర్మ (75 బంతుల్లో 101) కీలక పాత్ర పోషించాడు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (223 నాటౌట్)తో కలిసి తొలి వికెట్‌కు ఏకంగా 255 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలోనే రోహిత్ తన వన్డే కెరీర్‌లో 35వ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత తన వైరల్ సెలబ్రేషన్ గురించి రోహిత్ మాట్లాడుతూ, అది తన వ్యక్తిగత విషయమని స్పష్టం చేశాడు. మైదానంలోనే ఉన్న రవీంద్ర జడేజా కూడా ఈ సంబరం వెనుక ఉన్న కారణాన్ని అడగ్గా, డ్రెస్సింగ్ రూమ్‌కి వచ్చాక చెబుతానని దాటవేసినట్లు రోహిత్ తెలిపాడు.

అయితే డైవ్ చేస్తూ, గాల్లోకి ఎగురుతూ జెట్ స్పీడ్‌లో సంబరాలు చేసుకోవాలని జడేజా సలహా ఇచ్చాడని, కానీ 50 ఓవర్లు ఫీల్డింగ్ చేసి, మరో 30 ఓవర్లు బ్యాటింగ్ చేసిన తనకు అంత శక్తి లేదని సరదాగా సమాధానమిచ్చానని రోహిత్ పేర్కొన్నాడు. భారీ ఛేదనలో స్కోరుబోర్డు ఒత్తిడిని పక్కనపెట్టి కేవలం భాగస్వామ్యంపైనే దృష్టి పెట్టామని రోహిత్ వెల్లడించాడు. ఆఖరి వరకు నిలబడి డబుల్ సెంచరీతో జట్టును గెలిపించిన గిల్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు.

# చివరి వన్డేలో టీమిండియా కీలక మార్పులు

భారతదేశం వేదికగా జరుగుతున్న భారత్, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లలో ఘన విజయాలు సాధించిన టీమిండియా 2-0 తేడాతో అజేయమైన ఆధిక్యాన్ని దక్కించుకుంది. ఇప్పుడు ఆదివారం జరగనున్న మూడో అలాగే చివరి వన్డేలో వెస్టిండీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలని పట్టుదలగా ఉంది. అదే సమయంలో ఇప్పటివరకు తుది జట్టులో ఆడే అవకాశం రాని రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లను మైదానంలోకి దించి వారి ప్రతిభను పరీక్షించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. గౌహతిలో జరిగిన రెండో వన్డేలో భారత్ అద్భుతమైన ప్రదర్శన చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో కెప్టెన్ శుభమన్ గిల్ అజేయంగా 223 పరుగులు చేయగా, రోహిత్ శర్మ 101 పరుగులతో రాణించారు. అయితే ఈ సిరీస్‌లో బ్యాటింగ్‌కు అనుకూలంగా పిచ్‌లు మారుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. గత మ్యాచ్‌లో రెండు జట్లు కలిసి ఏకంగా 800లకు పైగా పరుగులు సాధించడం విశేషం. భారత్ ప్రధాన కోచ్ గౌతం గంభీర్ సైతం బ్యాట్, బాల్ మధ్య సరైన బ్యాలెన్సింగ్ ఉండాలని అభిప్రాయ పడ్డారు. ముఖ్యంగా భారత బౌలర్లు మిగతా ఓవర్లలో వికెట్లు తీయడానికి కాస్త ఇబ్బంది పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సిరీస్ ఇప్పటికే మనవశం కావడంతో మేనేజ్‌మెంట్ తుది జట్టులో కొన్ని ప్రయోగాలు చేయడానికి ఇది సరైన సమయంగా భావిస్తోంది. రుతురాజ్ గైక్వాడ్, కేఎల్




రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, మొహమ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్లకు తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. తొలి రెండు మ్యాచ్‌లలో ఓపెనర్లు రోహిత్, గిల్‌తో పాటు కోహ్లీ కూడా అద్భుతంగా రాణించారు. స్క్వాడ్‌లో మొత్తం 15 మంది ఆటగాళు ఉండగా, కేవలం బెంచ్‌కే పరిమితమైన వారికి ఆడే సమయం లభిస్తుంది.

అయితే గత మ్యాచ్‌లో ఎడమ కాలి హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ప్రసిద్ధ్ కృష్ణ చివరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో అన్షుల్ కంబోజ్ జట్టులోకి వచ్చాడు. భారత పేస్ బౌలింగ్ విభాగంలో యువ ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. తొలి రెండు మ్యాచ్‌లలో ఆడే అవకాశం రాని స్థానిక పేసర్ మొహమ్మద్ సిరాజ్ తుది జట్టులోకి తిరిగి వచ్చే ఛాన్స్ ఉంది. శ్రీలంక పర్యటన తర్వాత సిరాజ్ తన అత్యుత్తమ లయను అందుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. గురునూర్ బ్రార్, ఆకిబ్ నబీ వంటి యువ సంచలనాలు కూడా అవకాశాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాది చివరిలో న్యూజిలాండ్‌తో జరగబోయే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు, ఈ ఆఖరి వన్డే యువ బౌలర్లకు తమ సత్తా నిరూపించుకోవడానికి గొప్ప వేదిక కానుంది. ముల్లాంపూర్ వేదికగా పురుషుల వన్డే మ్యాచ్ జరగడం ఇదే మొదటిసారి. ఇక్కడి పిచ్ బౌలర్లకు కొంత వరకు సహకరిస్తుందని భావిస్తున్నారు. సిరీస్ కోల్పోయినప్పటికీ, వెస్టిండీస్ జట్టు తమ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. గత మ్యాచ్‌లో ఆ జట్టు 405 పరుగులు సాధించి సంచలనం సృష్టించింది. జాన్ క్యాంప్‌బెల్, షై హోప్, అమీర్ జాంగూ సెంచరీలతో అదరగొట్టారు. భారత్ చేతిలో ఓడిపోయినప్పటికీ, తమ బ్యాటింగ్ వైఫల్యాలను సరిదిద్దుకొని ఈ ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధించి పరువు నిలుపుకోవాలని కరీబియన్ జట్టు భావిస్తోంది.

# భారత్ ఏ అసాధారణ పోరాటం..

**ఆస్ట్రేలియా ఏ జట్టుతో రెండో టెస్టు ఉత్కంఠభరిత డ్రా-1-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ ఏ జట్టు**

భారత్ ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్టు మ్యాచ్ థ్రిల్లర్‌ను తలపించింది. చివరి రోజు అసాధారణ పోరాటపటిమ కనబరిచిన యశ్ రాథోడ్, షామ్స్ ములానీ గట్టి పట్టుదలతో క్రీజులో నిలబడి మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఏ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో 162 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్, ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో సిరీస్ విజేతగా నిలిచింది. శుక్రవారం, నాలుగో రోజు ఆటలో 365 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఏ, ఆట ముగిసే సమయానికి 103 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. విజయానికి 55 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, ఆసీస్ బౌలర్ల నిరంతర దాడిని తట్టుకుని ఓటమిని తప్పించుకోవడంలో సఫలమైంది. నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన తుషార్ దేశ్‌పాండే (52), యశ్ రాథోడ్ (80) హాఫ్ సెంచరీలతో కీలక పాత్ర పోషించగా, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన షామ్స్ ములానీ (131 బంతుల్లో 26) అద్భుతమైన డిఫెన్స్‌తో



మ్యాచ్‌ను కాపాడాడు. నాలుగో రోజు ఆట ప్రారంభంలోనే భారత్ ఏ పై ఒత్తిడి పెరిగింది. అయితే నైట్‌వాచ్‌మన్ తుషార్ దేశ్‌పాండే సుమారు 180 నిమిషాల పాటు క్రీజులో నిలబడి ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (26)తో కలిసి 60 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే లంచ్ తర్వాత ఆసీస్ బౌలర్ లియామ్ స్కాట్ (5/52) తన పదునైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వైవిధ్యభరిత బౌన్స్‌తో ఇబ్బంది పెడుతూ పడిక్కల్, దేశ్‌పాండేలతో పాటు తొలి మ్యాచ్ సెంచరీ హీరో కుమార్ కుశాగ్రను కూడా పెవిలియన్ చేర్చాడు. దీంతో భారత్ ఏ 199 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో యశ్ రాథోడ్, షామ్స్ ములానీ జతకలిశారు. ఓటమి అంచున ఉన్న జట్టును గట్టెక్కించడానికి వీరోచితంగా పోరాడారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 131 బంతులు ఎదుర్కొని 85 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్ డ్రా దిశగా సాగుతున్న దశలో లియామ్ స్కాట్ మళ్లీ చెలరేగాడు. మొదట రాథోడ్‌ను, ఆ తర్వాత ములానీని ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి ఉత్కంఠను తారాస్థాయికి చేర్చాడు. చివరి మూడు ఓవర్లు మిగిలి ఉండగా భారత్ చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది.

# హార్దిక్ లేకుండా 2027 వన్డే ప్రపంచకప్ గెలవడం కష్టం

**<u>మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సూచన</u>**

వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీలో భారత్ విజయం సాధించాలంటే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఉండటం కీలకమని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. అతను ఉంటే జట్టు సమతూకంగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ పాండ్యా పూర్తిగా ఫిట్‌గా ఉంచి, ప్రపంచకప్‌కు సిద్ధం చేయడం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ముందున్న అతి పెద్ద సవాల్ అని చెప్పుకొచ్చాడు.ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027 షెడ్యూల్‌ను ఐసీసీ గురువారం ప్రకటించింది. అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనుంది. తొలి మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్‌తో భారత్ తలపడనుంది. హార్దిక్ పాండ్యా ఇప్పటికే 2019, 2023 ప్రపంచకప్‌లు ఆడాడు. 2023లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా చీలమండ గాయం కావడంతో టోర్నీకి దూరమయ్యాడు. అతని గైర్హాజరీ టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది. తాజాగా మెగా టోర్నీ గురించి మాట్లాడిన గంగూలీ.. హార్దిక్ పాండ్యా అవసరాన్ని నొక్కి చెప్పాడు. 'ప్రపంచకప్‌లో టీమిండియా కాంబినేషన్‌కు హార్దిక్ పాండ్యా చాలా ముఖ్యం. అతన్ని మైదానంలో ఫిట్‌గా ఉంచడం గంభీర్ ముందున్న అతి పెద్ద సవాల్. ప్రస్తుతం అతను తగినంత క్రికెట్ ఆడటం లేదు. ఒకవేళ హార్దిక్ పాండ్యా అందుబాటులో లేకపోతే నితీష్ రెడ్డి ప్రత్యామ్నాయం అవుతాడు. కానీ నితీశ్‌ను హార్దిక్‌కు ప్రత్యామ్నాయంగా చూడాలంటే అప్పటివరకు అతను నిలకడగా క్రికెట్ ఆడాలి. ఆ స్థాయిలో ప్రదర్శన చేయాలి.'అని సౌరవ్ గంగూలీ జియో హాట్‌స్టార్‌తో అన్నాడు. 'రవీంద్ర జడేజా కూడా మరో ప్రత్యామ్నా యం. కానీ సౌతాఫ్రికా కండిషన్స్‌లో స్పిన్ కంటే పేస్ ఆల్‌రౌండర్ అవసరం ఉంటుంది. భారత టాప్-5 బ్యాటర్లలో ఎవరూ బౌలింగ్ చేయరు కాబట్టి. భారత్‌కు ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ కావాలంటే ఆల్‌రౌండర్‌ను ఆడించాల్సిందే. తొలి మ్యాచ్‌లోనే భారత్ బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవడం మంచిదే. సెకండాఫ్‌లో సౌతాఫ్రికాతో జరిగే మ్యాచ్ కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. సొంత గడ్డపై




జరిగే ప్రపంచకప్‌కు సౌతాఫ్రికా బలమైన జట్టుతో బరిలోకి దిగుతోంది.'అని గంగూలీ చెప్పుకొచ్చాడు. భారత మాజీ వికెట్‌కీపర్ పార్థివ్ పటేల్ కూడా షెడ్యూల్‌పై స్పందించాడు. ఆరంభంలోనే రెండు కఠినమైన మ్యాచ్‌లు ఆడటం ద్వారా టీమిండియా కాంబినేషన్‌ను పరీక్షించుకోవచ్చని, కీలక ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఫామ్, వర్క్‌లోడ్‌ను అవసరానికి తగ్గట్టు చూసుకొవచ్చని చెప్పాడు. ఈ ఫార్మాట్ పాకిస్థాన్‌కు బాగా నచ్చుతందని, కనీసం సూపర్ 7 చేరవచ్చని ఆ జట్టు భావిస్తుందని సెటైర్లు పేల్చాడు.

# రిటైర్మెంట్ ప్రకటించిన యుజ్వేంద్ర చాహల్!

టీమిండియా వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ రెడ్ బాల్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌తో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. కౌంటీ క్రికెట్‌లో భాగంగా లార్డ్స్‌లో తన చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడిన అనంతరం చాహల్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. దాంతో భారత్ తరఫున టెస్ట్ క్రికెట్ ఆడాలనే చాహల్ కలలకు అధికారికంగా తెరపడినట్లయింది. వైట్‌బాల్ క్రికెట్‌లో మాత్రం రీఎంట్రీ కోసం తన ప్రయత్నాలు కొనసాగుతాయని స్పష్టం చేశాడు. 'భారత్ తరఫున టెస్ట్ క్యాప్ అందుకోవడం నా కెరీర్ లో అతిపెద్ద కల. కానీ ఇకపై అది నెరవేరకపోవచ్చు. ఈ ఫార్మాట్‌లో ఇప్పటివరకు సాగిన నా ప్రయాణం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. రెడ్ బాల్ క్రికెట్ అనేది ఓ ఫార్మాట్ మాత్రమే కాదు. ఆటగాళ్లకు ఓపిక, క్యారెక్టర్, మైదానంలో కొన్ని గంటల పాటు శ్రమించడంలో ఉన్న అసలైన సంతోషాన్ని తెలియజేస్తుంది.'అని చాహల్ చెప్పుకొచ్చాడు. హర్యానా తరఫున 2009లో చాహల్ ఫస్ట్‌క్లాస్ కెరీర్‌ను ప్రారంభించాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 49 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు.




32.27 యావరేజ్‌తో 148 వికెట్లు నేలకూల్చాడు. కౌంటీ క్రికెట్‌లో ఇంగ్లండ్ నార్తాంప్టన్‌షైర్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించిన చాహల్.. అద్భుత ప్రదర్శన కనబర్చాడు. కౌంటీ చాంపియన్‌షిప్-2లో 6 మ్యాచ్‌ల్లోనే 16.14 సగటుతో 21 వికెట్లు పడగొట్టి అందరి దృష్టినీ ఆకర్షించాడు. లార్డ్స్ లో మిడిల్‌సెక్స్‌తో జరిగిన మ్యాచ్ చాహల్ కెరీర్‌లో చివరి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌గా నిలిచింది. టీమిండియా టెస్ట్ జట్టులో రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు సుదీర్ఘ కాలం సత్తా చాటడంతో చాహల్‌కు అవకాశం లేకుండా పోయింది.

# (సంపాదకీయం)

## కాలుష్యానికి కారణమెవరు!?

ఢిల్లీ పేరు చెప్పగానే నేటి కాలంలో టక్కున గుర్తుకు వచ్చేది కాలుష్యం. కొన్ని ఏళ్లుగా ఢిల్లీని శాసిస్తున్నది ఈ కాలుష్య మహమ్మారి. రాత్రి పగలు అనె తేడా లేకుండా ఎప్పుడు చుసిన కాలుచయం విరజిమ్ముతూనే ఉంది. మరి ఈ కాలుష్యం ఇంతలా పెరిగిపోవడానికి కారణమెవరు?. ఎందుకు ఇంతలా రోజురోజుకి పెరుగుతుంది? అంటే దీనికి ఎక్కడా సమాధానం లేకుండా పోయింది. చేతులుకాలాక ఆకులు పట్టుకున్నట్లు.. ఇప్పుడు చర్యలు చేపడితే ఎం లాభం? నిజంగా దీనికి నిజమైన సమాధానం చెప్పలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రతి ఏటా ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు కొన్ని ప్రకటిస్తుంది. శీతాకాలంలో పాలకులకు ఇది ఒక క్రమం తప్పలేని ఎజెండా. సోమవారం కూడా మళ్ళీ అదే జరిగింది. పలురకాల నిర్మాణాలమీద నిషేధం విధించారు, కార్యాలయ వేళల్లో మార్పుచేర్పులు ప్రకటించారు, ఆఫీసులకు వచ్చిపనిచేసే సిబ్బందిలో సగంమందిని ఇంటినుంచి పనిచేయాలంటున్నారు, నగరం బయట రిజిస్టరయిన వాహనాల నగర ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు, పార్కింగ్ చార్జీలు కూడా పెంచారు. ఈ జాబితాలో ఏవి ఎప్పటినుంచి అమల్లోకి రాబోతున్నాయన్నది అటుంచితే, శీతాకాలం ప్రవేశం వరకూ ఇష్టారాజ్యంగా సాగినవన్నీ, ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైనవిగా తోచడం, పరిణమించడం విశేషం. ఇప్పటిచలి తాత్కాలికమేనని, అల్పపీడన ప్రభావం తగ్గితే పరిస్థితిలో కాస్తంత మార్పు రావచ్చని అంటున్నప్పటికీ, కాస్తంత అటూఇటూగా ఈ సంక్షోభం ఏటా ఎదుర్కోక తప్పనిదే. నిర్మాణాలు, కూల్చివేతలమీద పూర్తిస్థాయి నిషేధాన్ని అటుంచితే, ఇప్పటికే అమలులో ఉన్న 'నో ఫ్యూయల్--నో పీయూసీ' విధానాన్ని మరింత కఠినంగా అమలు చేస్తారట. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు ఉన్న ఐదువందల పెట్రోల్ బంకుల్లో పాతవాహనాలమీద విరుచుకుపడతారట. రెండున్నర లక్షలవాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయబోతున్నట్టు, ఉన్న ఐదువేల ఎలక్ట్రిక్ బస్సులకు మరో నూటయాభై బస్సులను చేర్చి ప్రజారవాణాను మెరుగుపరచనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. పార్కింగ్ ఫీజులను భారీగా పెంచితే, ప్రజలు విధిగా ప్రజారవాణావైపు పరుగులు తీస్తారని అది బలంగా నమ్ముతున్నట్టు కనిపిస్తోంది. ప్రజలు నిజంగానే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీదే ఆధారపడితే, ఢిల్లీలో ఉన్న ఆ వ్యవస్థ ఏమాత్రం సరిపోదు. పద్నాలుగువేల బస్సులు అవసరమైన చోట సగం మాత్రమే ఉన్నాయి, నగరంలోని మొత్తం ప్రయాణికుల్లో ఐదుశాతం జనాభాను మాత్రమే మెట్రో తీసుకుపోతోంది. ఇక, వెచ్చదనంకోసం ప్రజలు చెత్తనీ, బొగ్గూకట్టెలూ కాల్చకుండా నిరోధించడానికి తాత్కాలికంగా విద్యుత్ హీటింగ్ స్పాట్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలంతా అక్కడికే వెళ్ళి చలికాచుకుంటారని కూడా ప్రభుత్వం నమ్మకం. కాలుష్యకాలం కమ్ముకొచ్చినప్పుడు, బాణాసంచా వినియోగం కూడా ఒక పెద్దసమస్యగా, వివాదంగా మారడం ఏటా ఉన్నదే. టపాసుల వాడకంమీద ఆంక్షలు విధించాలంటూ దాఖలైన పిటిషన్‌మీద సుప్రీంకోర్టు బుధవారం తన అభిప్రాయాన్ని ప్రకటిస్తూ, పూర్తి నిషేధానికి తాను అనుకూలం కాదని, అలాగని, రోజంతా కాల్చడానికి ఒప్పుకోనని వ్యాఖ్యానించింది. కొన్ని రకాల టపాసుల తయారీకి కూడా ఇకపై వీలు కలగబోతోంది. దీపావళినాడు బాణాసంచా కాల్చే విషయంలో సుప్రీంకోర్టు వైఖరిలో ఇటీవల పెనుమార్పు వచ్చిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏలుబడిలో ఉన్నంతకాలం ఢిల్లీలో టపాసులమీద నిషేధం అమలైంది. మొదట్లో బేరియం లవణాలు లేని టపాసుల తయారీకి అనుమతించినప్పటికీ, ఆ మినహాయింపు కూడా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం అమలైంది. పాలకుల, న్యాయస్థానాల చొరవవల్ల, పెరిగిన కాలుష్యభయం వల్ల ఢిల్లీ వాసుల్లో కూడా టపాసులమీద మోజు తగ్గింది. విపక్షంలో ఉండగా, ఈ నిషేధాన్ని తప్పుబడుతూ వచ్చిన బీజేపీ ఢిల్లీలో తాను అధికారంలోకి రాగానే టపాసులపై సర్వోన్నత న్యాయస్థానంతోనే సరే కానివ్వండని అనిపించుకుంది. పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒక బలమైన కారణం కనుక, పరిస్థితిలో మార్పు వస్తున్నా ఈ మారు కూడా ఆ ప్రభావాన్ని కాదనలేం. ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో అనేకం గతకాలంలోనూ అమలు జరిగినవే. గద్దెమీద ఎవరున్నా ఈ తక్షణ ఉపశమన చర్యలనే మహాద్భుతమైనవిగా అభివర్ణించుకోవడం సహజం. గ్యాస్ చాంబర్‌లాగా తయారైన ఢిల్లీలో వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్న సామాన్యులకు ఏటా వచ్చే ఈ ఆపదనుంచి విముక్తి ఎప్పుడో తెలియడం లేదు. అంటే ఈ ప్రశ్నకు సమాధానం దొరకని పరిస్థితి. ఇప్పటికైనా ఓ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటూ కొన్ని కటినమైన నిర్ణయాలు అమలు చేస్తూ ఢిల్లీలో పేరుకుపోయిన కాలుష్య మహమ్మారిని పారద్రోలవచ్చు. ఆ దిశగా అధికారులు పాలకులు ఆచరణలో పెట్టి ఢిల్లీని కాపాడాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లేదంటే మ్నున్ముందు మరింత ప్రాణాంతకంగా మరోచ్చునని సూచిస్తున్నారు.

# కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు ప్రధాని మోదీ భరోసా!





న్యూఢిల్లీ, అక్టోబర్ 02 ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన తీవ్ర ఘటనలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు అసాధారణ ధైర్యం ప్రదర్శించిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. ఘటన సమయంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను, ఆ సమయంలో తనకు ధైర్యం ఇచ్చిన అంశాలను మచ్చార్ ప్రధానితో పంచుకున్నారు .దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో కో-పైలట్ దాడి చేయడంతో మచ్చార్ తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి చేరుకుని దాడి చేసిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలో ఉన్న 174 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ సందర్భంగా మచ్చార్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తిని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చిన ఆయనను అభినందిస్తూ.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రస్తుతం మచ్చార్‌ను మెరుగైన చికిత్స కోసం యూఏఈకి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత దౌత్య వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనపై యూఏఈ, ఇజ్రాయెల్ దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. దాడికి దారితీసిన కారణాలు, కో-పైలట్ ఉద్దేశ్యంపై అధికారులు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసంపై ఆయన తండ్రి భూపేంద్ర మచ్చర్ స్పందించారు. విమానం నడపడమంటే తన కుమారుడికి అత్యంత ప్రీతిపాత్రమని, అదే అతని ప్రపంచమని ఆయన పేర్కొన్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే తమ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురైందని భూపేంద్ర తెలిపారు. "తల్లిదండ్రులుగా ఆ వార్త వినగానే మేము ఎంతగానో కలత చెందాం. వెంటనే ఇంట్లో దేవుడి ముందు దీపం వెలిగించి, ఎలాంటి అశుభవార్త వినకూడదని ప్రార్థించాం. ఆందోళనతో గుడికి కూడా వెళ్లాం" అని ఆయన ఆనాటి క్షణాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం స్మిత్ అబుదాబిలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన వెల్లడిం చారు. ఈ దాడిలో స్మిత్ తల, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, వైద్యులు ఇప్పటికే శస్త్రచికిత్స చేశారని తెలిపారు. అతను పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని వైద్యులు వెల్లడించినట్లు పేర్కొన్నారు. తీవ్ర గాయాలతో కాక్‌పిట్ లో కింద పడిపోయినప్పటికీ, ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలనే దృఢ సంకల్పంతోనే స్మిత్ కాక్‌పిట్ తలుపులు తెరిచాడని, తద్వారా విమాన సిబ్బంది, ప్రయాణికులు లోపలికి ప్రవేశించి దాడి చేసిన వ్యక్తిని నిలువరించగలిగారని ఆయన వివరించారు.

# భారత్‌లో ధర్మం, దేశం వేర్వేరు కాదు

### ప్రపంచానికి ఆధ్యాత్మిక జ్ఞానం పరిష్కారం చూపుతుంది- ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ వెల్లడి



న్యూఢిల్లీ, అక్టోబర్ 02 భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు

. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, "మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి" అని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూ ర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోంది" అని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు. "ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసు" అని ఆయన వ్యాఖ్యాని ంచారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం భారతాలు, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి అత్యున్నత జ్ఞాన సంపద మన దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని పుణికిపుచ్చుకున్న వారిని, వారి సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది సమస్త మానవాళికి చేసే సేవ అని కొనియాడారు. "మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు, మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారు" అని భగవత్ ఉద్ఘాటించారు.

# సర్ విచారణ మీ ఇంటి వద్దకే..

### కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఈసి- ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం

హైదారాబాద్, అక్టోబర్ 02(ఆర్ఎన్ఏ)

తెలంగాణా రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలను ఇచ్చింది. ఈ మేరకు ఓటర్లకు నష్టం జరగకుండా, ఇబ్బంది కలగకుండా వారి ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తాజాగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు.ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ




చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని సీఈఓ ఆదేశించారు.

ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఇక తాజా ఆదేశాలతో విచారణకు రాని వారి ఇళ్ళకు నేరుగా బీఎల్ వోలు వెళ్లి కావాల్సిన డాక్యుమెంట్స్ తీసుకోవాలని సూచించారు.




## ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధం..

యుద్ధ పరిస్థితులను పలు విమానయాన సంస్థలు క్యాష్ చేసుకుంటున్నాయి. టికెట్ ధరలను భారీగా పెంచేశాయి. హైదరాబాద్ నుంచి లండన్, ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్లే విమానాల టికెట్ ధరలు భారీగా పెరిగాయి. ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధం.. భారీగా పెరిగిన విమాన టికెట్ ధరలు.. ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇండియానుంచి ఇతర దేశాలకు వెళ్లే పలు విమాన సర్వీసులు రద్దవుతున్నాయి. ఈ రోజు(మంగళవారం) బెంగళూరు కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి 42 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు సంబంధించి 80 సర్వీసులు రద్దయ్యాయి. కోలకతా నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి 10 విమాన సర్వీసులు రద్దయ్యాయి. రద్దయిన విమాన సర్వీసుల్లో యూఏఈ సర్వీసులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. రియల్టర్ల ప్రకటనలపై నిఘా! భరోసా కేంద్రాల ఏర్పాటులో తెలంగాణదే మొదటిస్థానం లాసెట్ దరఖాస్తు గడువు పెంపు ప్రియుడి చేతిలో బాలిక దారుణ హత్యభర్తను సుత్తితో కొట్టి చంపిన మతిస్థిమితం లేని భార్యయుద్ధ పరిస్థితులను పలు విమానయాన సంస్థలు క్యాష్ చేసుకుంటున్నాయి. టికెట్ ధరలను భారీగా పెంచేశాయి. హైదరాబాద్ నుంచి లండన్, ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్లే విమానాల టికెట్ ధరలు భారీగా పెరిగాయి. సాధారణ ధరల కంటే రెట్టింపు అయ్యాయి. మంగళవారం హైదరాబాద్ నుంచి లండన్ వెళ్లే విమానాల టికెట్ ధరలు 65 వేల రూపాయల నుంచి 90 వేల రూపాయల వరకు ఉన్నట్లు సమాచారం.

# స్థిరంగా వెండి, బంగారం ధరలు..



అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో కాస్త స్థిరంగా కొనసాగిన బంగారం, వెండి ధరలు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఒక్కసారిగా పెరిగాయి.

స్థిరంగా వెండి, బంగారం ధరలు.. ఈ రోజు ఎలా ఉన్నాయంటే..అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో కాస్త స్థిరంగా కొనసాగిన బంగారం, వెండి ధరలు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఒక్కసారిగా పెరిగాయి. యుద్ధం కారణంగా మరింత భారీగా పెరిగే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి

రియల్టర్ల ప్రకటనలపై నిఘా!

ఈ రోజు (మార్చి 3న) ఉదయం 6:30 గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,70,500 దగ్గర ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,290 దగ్గర ఉంది (శ్రీఅజవ స్త్రశీశ్రీ‌ఽ తీఖ్‌వం). ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,70,650కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,56,440కి చేరుకుంది.

మరోవైపు వెండి ధర కూడా స్థిరంగా కొనసాగుతోంది. మూడు లక్షల రూపాయల మార్క్‌ను దాటేసింది. ఈ నేపథ్యంలో ఈ రోజు పలు నగరాల్లో బంగారం, వెండి రేట్లు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం..

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ.1,70,500, రూ.1,56,290
విజయవాడలో రూ.1,70,500, రూ.1,56,290
ఢిల్లీలో రూ.1,70,650, రూ.1,56,440
ముంబైలో రూ.1,70,500, రూ.1,56,290
వడోదరలో రూ.1,70,550, రూ.1,56,340
కోల్‌కతాలో రూ.1,70,500, రూ.1,56,290
చెన్నైలో రూ.1,70,830, రూ.1,56,590
బెంగళూరులో రూ.1,70,500, రూ.1,56,290
కేరళలో రూ.1,70,500, రూ.1,56,290
పుణెలో రూ.1,70,500, రూ.1,56,290




## మార్కెట్ మండేన్!

ముంబై: పశ్చిమాసియా యుద్ధ జ్వాలల్లో భారత్ సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు మండిపోయాయి. బీఎ?సఈలో సోమవారం ట్రేడింగ్ ఆరంభంలో 2,743.46 పాయింట్లు (3.37 శాతం) పతనమై 78,543.73 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. చివరికి 1,048.34 పాయింట్ల (1.29 శాతం) నష్టంతో 80,238.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 25,000 కీలక మద్దతు స్థాయిని కోల్పోయింది. ప్రారంభ ట్రేడింగ్‌లో 575.15 పాయింట్లు (2.28 శాతం) పతనమై 24,600 స్థాయికి జారిన సూచీ.. ట్రేడింగ్ నిలిచేసరికి 312.95 పాయింట్ల (1.24 శాతం) నష్టంతో 24,865.70 వద్ద స్థిరపడింది. ఈక్విటీ మార్కెట్ మదుపరుల సంపదగా భావించే బీఎ?సఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.6.59 లక్షల కోట్లు తగ్గి రూ.456.90 లక్షల కోట్లకు (5 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. మరిన్ని విషయాలు.. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 27 క్షీణించాయి. యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు విమాన సర్వీసులను భారీగా రద్దు చేయాల్సి రావడంతో ఇండిగో షేరు 6.25 శాతం నష్టంతో సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

## జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే.. ఈ ఆహారాలను రోజూ తీసుకోవాల్సిందే..!



తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ తాజా పండ్లు, కూరగాయలు పొట్టలో మైక్రోబయోమ్ పై, శరీరం మొత్తం మెటబాలిక్ ఆరోగ్యంపై ఎలా ప్రభావాన్ని చూపుతాయో చాలా మందికి తెలియదు. శరీరంలో ఇతర అవయవాలపై ఏవిధంగా శ్రద్ధ చూపిస్తామో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంపై కూడా అదేవిధంగా శ్రద్ధ చూపించడం చాలా అవసరం. జీర్ణవ్యవస్థను రెండవ మెదడు అని కూడా పిలుస్తూ ఉంటారు. జీర్ణక్రియకు, రోగనిరోధక శక్తికి, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి జీర్ణవ్యవస్థ ఆరోగ్యం చాలా ముఖ్యం. జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మొత్తం శరీర శ్రేయస్సును పెంపొందిస్తుంది. చాలా మంది తీసుకునే ఆహారం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. సరైన ఆహారం పొట్టలో మంచి బ్యాక్టీరియా శాతాన్ని మెరుగుపరుస్తుంది. ఫైబర్, ప్రీబయోటిక్, ప్రోబయోటిక్ ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోవడం వల్ల పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరిగి మెటబాలిక్ ఆరోగ్యం మెరుగుపడుతుంది. పొట్ట ఆరోగ్యాన్ని, పొట్టలో మంచి బ్యాక్టీరియాను పెంచే అనేక రకాల పండ్లు, కూరగాయలు అనేకం అందుబాటులో ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని రకాల పండ్లు, కూరగాయల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### ఆపిల్, అరటి పండు..

ఆపిల్ లో పెక్టిన్ అనే ఫైబర్ ఉంటుంది. ఇది ఒక ప్రీబయోటిక్ ఫైబర్. పొట్టలో మంచి బ్యాక్టీరియాకు ఇది ఆహారంగా పని చేస్తుంది. ఆపిల్స్ ను తీసుకోవడం వల్ల పొట్టలో బ్యాక్టీరియా సమతుల్యంగా ఉంటుంది. జీర్ణక్రియ పెరుగుతుంది. మలబద్దకం సమస్య తగ్గుతుంది. ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అరటి పండ్లను తీసుకోవడం ద్వారా కూడా పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. వీటిల్లో రెసిస్టెంట్ స్టార్చ్ పుష్కలంగా ఉంటుంది. ఇది ప్రీబయోటిక్ గా పని చేస్తుంది. పేగులో మంచి బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహించడంలో ఇది దోహదపడుతుంది. అరటిపండ్లను తీసుకోవడం వల్ల పేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. మలబద్దకం సమస్య నుండి సులభంగా బయటపడవచ్చు. సున్నితమైన పొట్ట ఉన్న వారు అరటిపండ్లు తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యలు తగ్గుతాయి.

## రక్తపోటు ఉన్నవారు ఏయే ఆహారాలను తీసుకోవాలి.. వేటిని మానేయాలి..?

మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది రక్తపోటు బారిన పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువత ఈ సమస్య బారిన ఎక్కువగా పడుతున్నారు. ఒక్కసారి రక్తపోటు సంబంధిత మాత్రలు వాడడం మొదలు పెడితే వాటిని జీవితాంతం వాడాల్సిందే. అలాగే రక్తపోటు గుండె జబ్బులు, స్ట్రోక్ లు వచ్చే అవకాశాలను పెంచుతుంది. కనుక రక్తపోటును అదుపులో ఉంచుకోవడంతో పాటు ఈ సమస్య బారిన పడకుండా ఎవరిని వారు కాపాడుకోవాలి. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లల్లో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల రక్తపోటును సులభంగా తిప్పికొట్టవచ్చు. అలాగే ఈ మార్పులు రక్తపోటు బారిన పడకుండా కాపాడడంలో కూడా ఎంతో సహాయపడతాయి. రక్తపోటును అదుపులో ఉంచుకోవడానికి జీవనశైలిలో చేసుకోదగిన మార్పుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### పొటాషియం ఉండే ఆహారాలు..

ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. రోజూ 30 నుండి 40 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తపోటు స్థాయిలు అదుపులో ఉండాలంటే శరీర బరువు అదుపులో ఉండడం కూడా చాలా ముఖ్యం. కనుక క్రాష్ డైట్స్ వంటి వాటితో కాకుండా ఆరోగ్యంగా బరువు తగ్గేలా చూసుకోవాలి. అలాగే చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోవడం మానేయడం ద్వారా కూడా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉన్న ఆహారాలను కూడా తీసుకోవడం తగ్గించాలి. దీని వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారు అరటిపండ్లు, చేపలు, పాలు, చిలగడదుంపలు వంటి పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇటువంటి ఆహారాలు రక్తపోటును తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. అయితే మూత్రపిండాల వ్యాధులతో బాధపడే వారు మాత్రం పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

### గ్రీన్ టీ, సెలెరీ జ్యూస్..

అలాగే ఉప్పును తీసుకోవడం తగ్గించాలి. ఉప్పును తక్కువగా తీసుకోవడం వల్ల కొందరిలో రక్తపోటు అదుపులో ఉంటుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటును పెంచుతాయి. కనుక వీటికి కూడా దూరంగా ఉండడం మంచిది. ధూమపానం కారణంగా కూడా రక్తపోటు పెరుగుతుంది. ధూమపానాన్ని మానేయడం వల్ల హృదయనాళ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తద్వారా రక్తపోటు



స్థాయిలు అదుపులో ఉంటాయి. రక్తపోటుకు కారణాల్లో ఒత్తిడి కూడా ఒకటి. కనుక ఒత్తిడి దరి చేరకుండా చూసుకోవాలి. యోగా, ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అలాగే డార్క్ చాక్లెట్ కూడా రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. డార్క్ చాక్లెట్ లో 60 శాతం కోకో ఉండేలా చూసుకోవాలి. గ్రీన్ టీ, సెలెరీ జ్యూస్ వంటివి కూడా రక్తపోటును తగ్గించడంలో దోహదపడతాయి. అల్లం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్న సంగతి తెలిసిందే. అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించడంతో పాటు రక్తపోటును తగ్గించడంలో కూడా అల్లం సహాయపడుతుంది.

## థైరాయిడ్ చిక్కులకు.. రోబోటిక్ పరిష్కరం

ఒకప్పుడు ఓపెన్ సర్జరీ కోసం రోగి శరీరంపై పెద్ద పరిమాణంలో కోత పెట్టాల్సి వచ్చేది. అందువల్ల రక్తస్రావం అధికంగా జరిగేది. శరీరంపై పెద్ద గాయం చేయాల్సి వచ్చేది. అంతర అవయవాల్లోనూ గాయం అయ్యేది. ఈ విధానంలో నొప్పి కూడా ఎక్కువే. గాటు పెట్టిన చోట కుట్లు వేసి మూసివేయాల్సి ఉంటుంది. ఆ కుట్లు ఆరడానికి కొంత కాలం పట్టేది. రోగి కోలుకునేదాక దవాఖానలో ఉండాల్సి వచ్చేది. సర్జరీ కోసం చేసిన గాయం కొందరిలో ఇన్‌ఫెక్షన్‌కు దారితీసేది. ఇది కూడా ప్రమాదకరమైనదే. రోగం నయమైనా గాయం మానడానికి కొంతకాలం పట్టేది. సుదీర్ఘమైన విధానం కావడం వల్ల రోగి కోలుకోవడానికి చాలాకాలం పడుతుంది. వైద్యరంగంలో ఆధునిక సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందడం వల్ల శస్త్రచికిత్సా పద్ధతుల్లోనూ పెను మార్పులు వచ్చాయి. ఓపెన్ సర్జరీకి ప్రత్యామ్నాయంగా ల్యాపరోస్కోపిక్ సర్జరీ వచ్చింది. ల్యాపరోస్కోపిక్ పద్ధతిలో శరీరంపై పెద్ద పరిమాణంలో కోత పెట్టాల్సిన అవసరం తప్పింది. చిన్న రంధ్రాలు



చేసి, వాటి ద్వారా శరీరంలోపల రోగం బారినపడిన అవయవానికి సర్జరీ చేస్తారు. ఈ ల్యాపరోస్కోపిక్ పద్ధతిలో ఓపెన్ సర్జరీలో చేసినట్టుగా చేతివేళ్లతో సులభంగా సర్జరీ చేయలేరు. ల్యాపరోస్కోపి పరికరాలకు చేతివేళ్లకు ఉన్న సౌలభ్యం ఉండదు. కాబట్టి అన్ని రకాల శస్త్రచికిత్సలను ల్యాపరోస్కోపిక్ పద్ధతిలో చేయడం సాధ్యం కావట్లేదు. ఇరుకుగా, సున్నితమైన అవయవాలు, శరీర భాగాల్లో (గొంతు, ఛాతీలోపల, ఊపిరితిత్తులు, గుండె పక్కన) సమస్య ఉంటే ల్యాపరోస్కోపిక్ సర్జరీ చేయడం కష్టం. కాబట్టి ఆ అవయవాలకు సులభంగా చికిత్స చేయడానికి రోబోటిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చింది.




# అక్టోబర్ 5న 'జైలర్ 2' ట్రైలర్

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన 'హుకుమ్ రీలోడెడ్' థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.

తారాగణం పరంగా కూడా ఈ సీక్వెల్ మరింత భారీగా ఉండనుంది. ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, తొలి భాగంలో అదరగొట్టిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లతో పాటు ఈసారి విజయ్ సేతుపతి కూడా ప్రత్యేక అతిథి పాత్రలో మెరవనున్నారు. దీంతో 'జైలర్ 2'పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఓటీటీలో ట్రెండ్ అవుతోన్న రేణూ దేశాయ్ 'కాశీ మజిలీ'





సాధారణంగా కాశీ వెళ్లొచ్చిన వాళ్లు.. "కాశీలో అది వదిలిపెట్టాం, ఇది వదిలిపెట్టాం" అని చెబుతుంటారు. కానీ దర్శకుడు యమునా కిశోర్ గారు కాశీని చూసిన కోణం చాలా లోతైనది. "కాశీ మన నుంచి ఏమీ తీసుకోదు.. మన గుండెల్లో ఉన్న బాధను మాత్రమే తీసుకుంటుంది, తిరిగి మనకు స్వచ్ఛమైన సంతోషాన్ని ఇస్తుంది" అనే ఒక అద్భుతమైన తాత్విక థీమ్‌తో ఆయన కాశీ మజిలీ సినిమాను మలిచారు. మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ గొప్ప ఆలోచనే నేడు విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. తన 'డ్రీమ్ మర్చంట్స్' సంస్థ ద్వారా ఇప్పటివరకు 600కు పైగా అడ్వర్టైజ్‌మెంట్‌లను (యాడ్ ఫిల్మ్స్) రూపొందించిన అపారమైన అనుభవం దర్శకుడు డి. యమునా కిశోర్ గారి సొంతం. నిరంతరం గ్లామర్, హంగులతో కలర్‌ఫుల్‌గా ఉండే ఆ యాడ్ ప్రపంచం నుంచి కాసేపు బయటికి వచ్చి.. పూర్తిగా ఆధ్యాత్మిక వాసనలు గుబాళించేలా, మనసుకు హత్తుకునేలా ఈ సినిమా తీయడం ఆయనలోని అసలైన సృజనాత్మకతకు, వైవిధ్యానికి నిదర్శనం. రేణు దేశాయ్, శంకర్ ఇందుచూడన్ ప్రధాన పాత్రల్లో సహజమైన నటనతో ఆకట్టుకున్న ఈ సినిమా కోసం, దివంగత మహాకవి శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు రాసిన ఒక అపురూపమైన పాటను ఉపయోగించారు. కథలోని ఆత్మను ప్రేక్షకుడి గుండెల్లోకి చేర్చడానికి సిరివెన్నెల గారి సాహిత్యాన్ని ఎంచుకోవడం, దానికి డా. జోశ్యభట్ల గారి సంగీతాన్ని జోడించడం యమునా కిశోర్ గారి ఉన్నతమైన సాహితీ, సంగీత అభిరుచికి అద్దం పడుతోంది. అద్భుతమైన కాశీ అందాలు, వాటిని తెరపై ఆవిష్కరించిన యమునా కిశోర్ గారి టేకింగ్, విభిన్నమైన ఒక ప్రేమ కథకు కాశీ ఆధ్యాత్మికతను జోడించిన తీరు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ. ప్రతి ఫ్రేములోనూ కనిపించే యమునా కిశోర్ గారి తాలూకు విజువల్ ఆస్థటిక్స్ , ఫ్రేము ఫ్రేములోనూ తొణికిసలాడే ఆధ్యాత్మికత ఈ చిత్రాన్ని ఒక దృశ్యకావ్యంలా నిలబెట్టాయి. కళ్యూరి జగదీష్ కుమార్ నిర్మాణంలో, రాణా ఛాయాగ్రహణం, మీర్ కూర్పు తోడవ్వగా.. దర్శకుడు డి. యమునా కిశోర్ గారి బహుముఖ ప్రజ్ఞకు, ఆయన క్రియేటివ్ విజన్‌కు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన ఈ 'కాశీ మజిలీ' ఇప్పుడు విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ ఇంటర్నెట్‌లో హల్చల్ చేస్తోంది.

# మళ్లీ తెరపైకి 'ఆరుగురు పతివ్రతలు'




టాలీవుడ్‌లో ప్రస్తుతం రీ-రిలీజ్ ట్రెండ్ జోరుగా సాగుతోంది. పాత కాలపు బ్లాక్ బస్టర్ హిట్లు, ప్రేక్షకుల మనస్సుల్లో నిలిచిపోయిన కల్ట్ క్లాసిక్ సినిమాలను నూత 4కే టెక్నాలజీతో మళ్లీ థియేటర్లలోకి తీసుకువస్తున్నారు. మాస్ యాక్షన్ చిత్రాలతో పాటు వినూత్నమైన కంటెంట్‌తో వచ్చిన సినిమాలకు కూడా నేటి తరం అభిమానులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం తన బోల్డ్ అండ్ రియలిస్టిక్ కంటెంట్‌తో టాలీవుడ్‌లో పెద్ద సెన్సేషన్ సృష్టించిన కల్ట్ క్లాసిక్ మూవీ 'ఆరుగురు పతివ్రతలు'మళ్లీ థియేటర్లలోకి రావడానికి సిద్ధమైంది. దివంగత ప్రముఖ డైరెక్టర్ ఈవీవీ సత్యనారాయణ తన సొంత నిర్మాణ సంస్థ "ఈవీవీ సినిమా" బ్యానర్‌పై ఈ సినిమాను స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించారు. 2004 ఫిబ్రవరి 6న విడుదలైన ఈ సినిమా అప్పట్లో తన విభిన్నమైన పోస్టర్లు, బోల్డ్ కథాంశంతో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. ఇప్పుడు సరిగ్గా 22 ఏళ్ల తర్వాత పోచమ్మ ఫిల్మ్స్ సమర్పణలో అక్టోబర్ 29న రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు నిర్మాతలు అధికారిక పోస్టర్ ద్వారా వెల్లడించారు.







# నడవలేని స్థితిలో సీనియర్ నటి శారద.. ?

సీనియర్ నటి శారద గురించి తెలుగు ఆడియెన్స్ కు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. వందలాది సినిమాల్లో నటించి మెప్పించిన ఆమె . తన నటనా ప్రతిభకు ప్రతీకగా ఏకంగా జాతీయ ఉత్తమ నటి అవార్డు కూడా అందుకున్నారు. మొదట హీరోయిన్ గా నటించిన శారద ఆ తర్వాత క్రమంగా సహాయక నటిగా మారిపోయారు. కేవలం తెలుగులోనే కాదు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ నటించి మెప్పించారు శారద. మూడుసార్లు జాతీయ ఉత్తమ నటి అవార్డులు, రెండు సార్లు ఫిలిం ఫేర్ అవార్డులు.. ఇలా శారద కీర్తి కిరీటంలో ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, ప్రశంసలు ఉన్నాయి. 1955లో వచ్చిన 'కన్యా శుల్కం' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు శారద. ఆ తర్వాత ఇద్దరు మిత్రులు, బలిపీఠం, శారద, దాన వీర శూర కర్ణ, తెనాలి రామకృష్ణ, స్వయంవరం ,నిమజ్జనం , ఊర్వశి, ఇంద్ర ధనుస్సు, ప్రతిధ్వని, జస్టిస్ చౌదరి, అత్తా కోడళ్లు, సర్దార్ పాపారాయుడు, అమ్మ రాజీనామా, ఏవండి ఆవిడ వచ్చింది, మేజర్ చంద్రకాంత్, అంతఃపురం, స్టాలిన్, యోగి, సుకుమారుడు.. ఇలా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో శారద నటించారు. కాగా ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీకి పూర్తిగా దూరంగా ఉంటున్నారు శారద. చివరిగా 2013లో సుకుమారుడు అనే సినిమాలో కనిపించారామె. ఈ మధ్యన పెద్దగా బయట కనిపించని ఆమె తాజాగా చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే ఈ ఈవెంట్ లో ఆమె సరిగ్గా నడవలేని పరిస్థితిలో కనిపించారు. ఈ ఈవెంట్ లో పక్కనున్న వారి సహాయంతో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు శారద.

# ఇరుముడి తర్వాత మరో డిఫరెంట్ మూవీ



మాస్ మహారాజా రవితేజ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తనదైన ఎనర్జీ, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించే ఆయన.. ఇటీవల ఇరుముడి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. రవితేజ- శివ నిర్వాణ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమా రూ.250 కోట్లకు పైగా వసూళ్లతో సత్తా చాటింది. ఓటీటీలో కూడా దుమ్మురేపుతోంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ ప్రకటించిన గ్లోబల్ టాప్-10 నాన్-ఇంగ్లీష్ సినిమాల జాబితాలో టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇలాంటి భారీ విజయాన్ని అందుకున్న రవితేజ నెక్ట్స్ మూవీ ఏంటి? ఎలాంటి కథను ఎంచుకోబోతున్నారు? అనే ఆసక్తి అభిమానుల్లో మొదలైంది. రవితేజ నెక్ట్స్ మూవీని దర్శకుడు వివేక్ ఆత్రేయతో చేయబోతున్నారట. మెంటల్ మదిలో, బ్రోచేవారెవరురా, అంటే సుందరానికి, సరిపోదా శనివారం వంటి సినిమాలతో వివేక్ ఆత్రేయ తనదైన మేకింగ్ స్టైల్‌ను చూపించారు.